# మబ్బు విడిచిన ఎండ

మెయిలు ఏదో నదిమీదుగా నడుస్తున్నట్లుంది. బ్రిడ్జిమీది నుండి వస్తున్న ధ్వని నిద్రపోయే వాళ్ళనుకూడా లేపి కూచోపెడుతున్నది. రాత్రి ఏడు దాటింది. కిటికీలోనుండి కనిపిస్తున్న ఆకాశంమీది నక్షత్రాలు మిరప పువ్వుల్లా వున్నాయి. చలిగాలి లోపలికి దూసుకువచ్చి ప్రయాణీకుల శరీరాల వెచ్చదనంతో కలిసి సేద తీర్చుకొంటున్నది. ఓ ఫస్టు క్లాసు కంపార్టుమెంటులోవున్న ఆ అయిదుగురూ కళ్ళు మూసుకొని ఎవరి ప్రపంచంలో వాళ్లు వున్నారు. ఆ అయిదుగురిలోనూ ఆమె ఒకతే ఆడది. మూలకు జరిగి ముడుచుకుకూచుంది. మొహానవున్న బొట్టు చెదరి, దువ్వుకున్న జుట్టు చెరిగి, కట్టుకున్న బట్టలుమాసి, కళ్ళ క్రింద ఏర్పడ్డ నల్లచారలతో అలసిపోయి కనిపిస్తోంది. ఆమె భర్త ఆమె ప్రక్కనేకూచుని వున్నాడు. నల్లగా లావుపాటి మెదమెదలాడే శరీరం. మొహంలో కాంతి లేదు. కళ్ళు లోపలకు పీక్కుపోయాయి. కొనముక్కు కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నది. అతను చలిగాలికిగాబోలు కోటు గుండీలు సరిచేసుకున్నాడు. ఆమెను మెల్లగా కుదుపుతూ అన్నాడు "జలుబు చేస్తుందేమో! ఆ కిటికీతలుపు వేసేయనా?"

ఆవిడ జవాబు చెప్పలేదు. చీరకొంగు తలమీదకు లాక్కుంది. గువ్వపిట్టలా మరింత దగ్గరకు ముడుచుకుంది. అతనావిడ వీపుమీద చెయ్యివేసి, ధైర్యం చెబుతున్నట్టుగా అన్నాడు. "బాధపడకు ఇటువంటప్పుడే ధైర్యంగా వుండాలి". ఆమెలో ఆ మాటలు విన్న తరువాత గూడా ఏ కదలికా కన్పించలేదు.

అతను, ఆమె మానానికి ఆమెను వదిలిపెట్టి ప్రక్కకు తిరిగాడు. ఒకరిద్దరు ప్రయాణీకులు ఆయనవైపే చూస్తున్నారు. అతను నవ్వబోయాడు. "మావాణ్ణి అస్సాం వేశారు. అస్సాం కూడా కాదు. నోర్త్ ఫ్రంట్‌కు పైన ఇంకా ఎక్కడో! వున్నదొక్కడు. వాడికోసమని వున్నవూరు వదిలిపెట్టి పట్నానికి వచ్చేశాం. పొలాలు కౌలుకిచ్చేశాం. వాడు గుంటూరంటే గుంటూరుకు, యూనివర్శిటీకి అంటే విశాఖపట్నానికి మకాం మార్చాం. కళ్ళల్లో వత్తులువేసుకు పెంచాం. డిగ్రీ పుచ్చుకుని ఇట్లా బయటికి వచ్చాడో లేదో, అట్లా ఆర్మీలో సెలక్షన్ వచ్చింది. ఏదో కమీషన్డ్ ఆఫీసరు!! ఏదైతే ఏం ?— బొలారంలో ట్రెయినింగ్ అయి, బెజవాడమీదుగా మద్రాసు వెళ్తున్నాట్ట! అక్కణ్ణుంచి ప్లెయిన్‌లో ఇంకెక్కడికో వెళ్తాట్ట!! కలుసుకుందామని బయల్దేరాం! విశాఖపట్నంనుంచి వస్తున్నా, బెజవాడదగ్గర పడుతున్న దనేసరికి, మా ఇంటిదానికి మరీ గుండె దడగా వుంది."

అంతవరకూ చెప్పి ఆయన ఆగిపోయాడు. ఆవిడ దీర్ఘంగా నిట్టూర్చింది. విన్నవాళ్ళిద్దరూ ఏమంత సానుభూతి చూపించలేదు. "అట్లాగా పాపం" అని కూడా అనకపోవడంతో ఆమెకు మరింత బాధ అనిపించింది. మళ్ళీ కళ్లుమూసుకు పడుకుంది. కళ్ళనుండి నీటి చుక్కలు. కిటికీ దగ్గరగా కూచున్న బల్‌దేవ్‌సింగ్, ఇటువేపుతిరిగి, కల్పించుకుంటూ, 'బాధెందుకూ, మీ అబ్బాయి ఇప్పుడు వెళ్తున్నాడు. మావాడు వెళ్ళడమూ రెండుసార్లు ప్రాణం పోయేంత పనై గాయాలు తగిలి ఇంటికి వచ్చి, మళ్ళీ నయంకాగానే ఆర్మీలోకి వెళ్ళిపోవడమూ కూడా అయింది. ఇంతవరకూ మీ వాణ్ణి మీకు దూరం చేయకుండా ఇంటిదగ్గరే వుంచినందుకు, ఆ భగవంతుడికి మీరు కృతజ్ఞతలు చెప్పుకోవాలి!' అన్నాడు.

బల్‌దేవ్‌సింగ్ మాటలు విని బెర్తుమీద పడుకున్న విద్యాశంకర్ మాలంకర్ పెద్దగా నవ్వాడు. "ఇట్ ఈజ్ నథింగ్! మా అబ్బాయి

లిద్దరూ, మా అబ్బాయిల పిల్లలు ముగ్గురూ, మా తమ్ముడూ, వాడి పెద్ద బావమరిదీ, మొత్తం పదుగురున్నారు మాఇంట్లో, ఆర్మీలో!"

ఆయన నవ్వు విని, ఆవిడకు కొంచెం కోపం వచ్చింది. ఆవిడ కోపం చూసి, ఆవిడ భర్త కల్పించుకున్నాడు. "నిజమే కావచ్చు. కానీ మా కున్నది వాడొక్కడే మరి!" అన్నాడు.

"అయితే ఏం? ఒక్కడే అయితే మరీ ప్రమాదం. గారాబంమరీ ఎక్కువ అవుతుంది. నలుగురుంటేనే ఆ నలుగుర్నీ సమానంగా చూడ డానికి వీలుంటుంది."

"అభిమానమంటే, అదేం రొట్టెముక్క కాదు. నలుగురికీ నాలుగు తుంపు లివ్వడానికి!"

"నిజమే నమ్మా! కానీ ఇక్కడో తమాషావుంది. నీ ప్రేమంతా ఒకడికే ఇచ్చేస్తున్నా ననుకుంటావ్, అట్లా నలుగురికీ నీప్రేమనిస్తావ్! అందులో తారతమ్యం చూపించక!! ఒక్కడున్నా, పదిమందున్నా, నువ్వు చూపించే ప్రేమ ఒకటే! నా సంగతే చూడు! నా ఇద్దరు కొడుకుల కోసమూ నేను బాధపడుతున్నాను. అంటే నీ ఒక్క కొడుకుకోసం నువ్వు పడేబాధలో నేను సగమే బాధపడుతున్నానని కాదు, నీ బాధకు రెట్టింపు బాధ నేను పడుతున్నాను."

ఆవిడ అసంతృప్తిగా మొహం ప్రక్కకు త్రిప్పుకొంది. ఆయన కొంచంసేపు ఆ మాటలువిని ఆలోచిస్తున్నట్టు మౌనంగా వుండి పోయాడు. ఆ తర్వాత గొంతు సవరించుకొంటూ అన్నాడు. "మీ విషయం కాదు. వాదనకోసం చెబుతున్నాను. ఓ తండ్రికి ఇద్దరు కొడుకులుంటే, అందులో మొదటివాడు అన్యాయం చేసిపోయినా, రెండో వాడైనా వుంటాడుగా, కన్నీళ్ళు తుడవడానికీ తలకొరివి పెట్టడానికీ!"

"నాన్సెన్స్!" అంతవరకూ తను చదువుతున్న ఇంగ్లీషునవలను అవతల పెడుతూ, ఆ ముసలాయనను అటకాయించాడు భట్టాచార్య.

అతను లావుగా వున్నాడు. అతని కళ్ళు ఎర్రగా, చిన్నగా వున్నాయి. దట్టమైన కనుబొమలు మాట్లాడుతుంటే ముందు కట్టించుకున్న బంగారపు పళ్ళు రెండూ బయట పడుతున్నాయి.

"నాన్సెన్స్" అన్నాడు మళ్ళీ. "మనకు తలకొరివి పెట్టాలన్న స్వలాభాపేక్షతో వాళ్ళను పెంచుతున్నామా మనం ?"

మిగిలిన ప్రయాణీకులు నలుగురూ అతనివైపు మిర్రి మిర్రి చూశారు. కొంచెంసేపు వాతావరణంలో మౌనం. బల్‌దేవ్‌సింగ్ అందుకుని అన్నాడు. "అవునవును. ఎవరి బ్రతుకులు వాళ్ళవి. ఏ ఒక ళ్ళకీ సంబంధం లేదు. మన పిల్లలు మనవాళ్ళు కాదు. వాళ్ళు దేశం సొత్తు, దేశ సౌభాగ్యం." "నాన్సెన్స్ ! దేశమూ లేదు. సొత్తూ లేదు. చిన్నప్పుడిదంతా ఆలోచించుకున్నామా మనం ? పెళ్ళి చేసుకున్నాం. ఆడదంటూ కనిపించింతర్వాత ........ సరే సరే, పిల్లలు పుట్టక తప్పు తుందా ? ఈ ప్రపంచంలోకి కేరుకేరుమంటూ వచ్చినప్పట్నించీ, వాళ్ళ బ్రతుకులు వాళ్ళవి, ఇదీ నిజం! మరేం చెప్పినా నేనన్నమ్మను. వాళ్ళకు మనమున్నాం కానీ మనకు వాళ్ళు లేరు. వాళ్ళూ పెరిగారు. పెద్దవాళ్ళ య్యారు. యౌవనం వచ్చింది. మనం ఆ వయస్సులో ఏమేంచేశామో వాళ్లూ అదే చేస్తున్నారు. అందులో క్రొత్తదనం ఏముందీ ? మనకూ అమ్మా, నాన్నా, అందరూ వున్నారు. అవునా ? కానీ కొంచెంవయసు వచ్చీ రాకుండానే మరికొన్ని విషయాల మీదికికూడా మన మనసు పోయింది. కాదూ ?— అందమైన అమ్మాయిలు, సిగరెట్లు, కాఫీ హోటేళ్ళు, హిందీ సినిమాలు, క్రొత్త క్రొత్త స్నేహితులు - ఆ ఉప్పెన వంటి ఉత్సాహం తగ్గిపోయిం తర్వాత, బాధ్యతలు, దేశం, చుట్టూ తిరిగే కన్నీళ్ళ మనుష్యులు, వీళ్ళు జ్ఞాపకం వచ్చారు. దేశానికి సేవచెయ్యాలనే కోరిక ఆ రోజుల్లో మనను బలంగా ఆక్రమించుకుంది. ఎవరి చేతనైనంత వాళ్ళచేత చేయించింది. ఇప్పుడూ మనం సంఘసేవ చేస్తున్నాం. దేశసేవ చేస్తున్నాం. కాదనడం లేదు. కానీ ఇంతకన్నా ఎక్కువగా

భార్యా బిడ్డలసేవ చేస్తున్నాం. కాదంటారా?" ఎవ్వరూ కాదనలేదు. అవుననలేదు. మౌనంగా వింటూ ప్రతిమల్లా కూచుండి పోయారు. మళ్ళీ భట్టాచార్య అందుకున్నాడు.

"ఇరవై యేళ్ళ వయస్సులో వున్న మన పిల్లల మనసుల్ని, కోరికల్ని, గ్రహించాలి అంటే మనం ఇరవై యేళ్ళ వాళ్ళం కావాలి. మనం గతంలో, ఆ వయసులో వున్నప్పుడు ఏం చేశామో జ్ఞాపకం చేసుకోవాలి. ఇరవై యేళ్ళ వాళ్ళకి దేశంమీద ప్రేమ మనకన్నా ఎక్కువగా వుంటే నేను ఆశ్చర్యపడను. దేశాన్నిగూర్చి ఆలోచిస్తూ, మనను గూర్చి వాళ్ళు తక్కువగా ఆలోచిస్తే నేను విచారపడను. మన దేశం మనను కన్నబిడ్డల్లా కాపాడాలంటే, దేశానికి కూడా మనం రక్షణ నియ్యాలి. అవునా? ఆ రక్షణను మనమేం ఇయ్యగలం? లేవలేని వాళ్ళం, మననీడలనుచూసి మనంబెదిరిపోయేవాళ్ళం!! ఆపని యువకులు చెయ్యాలి. వాళ్ళే చేస్తారు ధైర్యంగా, నవ్వుతూ. వాళ్ళను చూచి మనం విచారపడి కన్నీళ్ళు కారుతున్న మొహాలతో వాళ్ళకు వీడ్కోలు చెప్పడానికి వెడితే, వాళ్ళ గుండెలు బ్రద్దలై పోవూ? అయినా ఆ వయసులోనే దేశం కోసమని ఒకడు ప్రాణం కోల్పోతే, మనం ఎందుకు ఏడవాలి? ఈ లోకపు చీకటిని, వయసు పెరిగిన వాళ్ళ దగాకోరుతనాన్ని, సంఘపు క్రూరపు స్వార్థాన్ని, పడిపోయిన విలువల్ని - నిరుద్యోగాన్ని, ఆకల్ని, రోగాల్ని, పిరికి గుండెలు తండ్రులు కావడాన్ని, వాళ్ళు మనలాగా అనుభవించలేదే అని మనం ఏడవాలా? నేను ఏడవను. మీరూ ఏడవద్దు. నా కొడుకు యుద్ధంలో మరణించాడు వీరుడిలాగా. అట్లాగే, ఒక వేళ మీకూ జరిగినా, మీరు బాధపడవద్దు. నా కొడుకు నాకో వార్త పంపించాడు. తనకు చాతనైనంతలో తను జీవితాన్ని అనుభవించి, ధన్యం చేసుకుని వెళ్ళిపోతున్నానని. అట్లాగే అందరు కొడుకులూ అనుకోవాలని నేను...."

అతను మాట పూర్తి చేయకుండా దగ్గుతెర వచ్చింది. దాని ఉధృతం తగ్గిం తర్వాత, ప్రక్కనే పొడుగు సీసాలోవున్న మంచినీళ్ల

కాసినీ తాగి స్థిమితపడ్డాడు. అతని కళ్ళల్లోని నీటి చార దీపం వెలుగుకు మెరుస్తోంది. అందరూ తనవైపే చూస్తుండడం చూసి, బుజాలు సర్దుకుని పేలవంగానవ్వి, మఫ్లర్ సరిచేసుకున్నాడు.

ఆ పెట్టెలో వున్న అందరూ భట్టాచార్య మాటల ప్రవాహంలో పడి ఎప్పుడో కొట్టుకు పోయారు. ఎవరూ, ఎవరుగా మిగలలేదు. భట్టాచార్య మళ్ళీ ఏదోచెపుతున్నాడు. తన ఫ్లైయిట్ లెఫ్టినెంట్ ఎట్లాఅయిందీ, పాకిస్తాన్ మీదుగా గ్నాట్ విమానం నడుపుకుంటూ ఎట్లావెళ్ళిందీ, అతన్ని ఎన్నిశత్రువిమానాలు ఒక్కసారిగా ఎదుర్కొన్నదీ అతను కళ్ళకుకట్టినట్లు వర్ణిస్తున్నాడు. ఆవిడ ఆ మాటలు వింటూ, వింటూ ఎవరో తననుఅడగ మన్నట్టుగా ఒక్కసారిగా ఆయన వైపుకుతిరిగి, "నిజంగా చెప్పండి. అసలు మీ అబ్బాయి .... మీ అబ్బాయి .... చచ్చిపోయినాడా ?" అని అడిగింది.

అందరూ ఉలిక్కిపడి ఆమెవైపు చూశారు. నీళ్ళతో నిండిన తన పెద్దకళ్ళను, గుండ్రంగా పేలవంగా వున్న తనకళ్ళను ఆమెవైపు తిప్పి, క్షణంసేపు నిశ్చలంగా చూశాడు. ఏదో జవాబు చెప్దామను కున్నాడు. మాటలకోసం ప్రయత్నం చేశాడు. అప్పుడే, అప్పుడే తన ఒకే ఒక కొడుకు యుద్ధంలో చనిపోయిన వార్త తనకు తెలిసినట్లుగా తనకూ, తన కొడుకుకూ శాశ్వతంగా సంబంధం తెగిపోయిన విషయం తనకు మొట్టమొదటిసారిగా అనుభవానికి వచ్చినట్లుగా: అతని మొహం కుంచించుకుపోయింది. బాధతో అవమానంతో ముకుళించుకుని నల్లకప్పు వేసింది. రెండు చేతుల్తోనూ మొహాన్ని కప్పుకుని, బిగ్గరగా, చుట్టూ సహప్రయాణీకు లున్నారన్న సంగతిని మర్చిపోయి, దీనంగా, అనున యించినా, దాగనంతటి గుండెల్లో నిండిన ఆవేదనతో, ఏడ్వడం మొదలు పెట్టాడు. ఆవేదనాస్వరం, రైలు చేస్తున్న చప్పుడును మింగి పరిసరా లను క్రుంగి వేస్తున్నది. సర్వ ప్రకృతీ అతనియెడల సానుభూతి చూపి స్తున్నట్లు, ఆకాశంలో వెలుగుతున్న నక్షత్రాలను మబ్బులు క్రమ్ముకు తున్నాయి.